క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ డి.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, అన్సారి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో మొత్తం సీట్లు, 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 12 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివ స్వరూపరాణి మంగళవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శి బదిలీ

మునుగోడు: మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళిని జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరొక కార్యదర్శిని మునుగోడుకు నియమించకపోవడంతో కొరటికల్ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును ఇన్‌చార్జ్ కార్యదర్శిగా నియమించినట్లు ఎంపీడీఓ ఆర్.భాస్కర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బేటీ బచావో బేటీ పడావో

నార్కట్‌పల్లి: మండలంలోని నెమ్మాని గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు అంజమ్మ, సరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, డీఎచ్‌ఈడబ్ల్యూ కో ఆర్డినేటర్లు ఝాన్సి, సునీత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల బహూకరణ

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలకు సుల్తాన్ చాంద్ ట్రస్ట్ న్యూ ఢిల్లీ వారు రూ.2.48 లక్షల విలువ గల 568 పుస్తకాలను మంగళవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ వెంపటి శ్రీనివాస్, సీఓఈ బి.నాగరాజు, లైబ్రేరియన్ ఏ.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అంగన్‌వాడీ సిబ్బంది

నల్లగొండ టౌన్: నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిచందనను మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల విధులు నిర్వహించిన బీఎల్వోలకు గౌరవ వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకటరమణ, కార్యదర్శి మజ్జిగపు సునీత, కోశాధికారి పుట్ట సునీత, శశికళ పాల్గొన్నారు.

మంత్రి 'తుమ్మల'కు వినతి


మంత్రిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నార్కట్‌పల్లి: చేనేత మిత్ర పథకం 40శాతం నూలు సబ్సిడీ పునః ప్రారంభించాలని కోరుతూ తెలంగాణ చేనేత ఐక్య వేదిక జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పోచం వెంకటేశ్వర్లు మంగళవారం చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాపోలు వెంకటేష్, వనం మార్కోండయ్య, దేవులపల్లి మల్లేశం, బోగ సోమయ్య, కోమటి యాదగిరి, సోమనాథం తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ

కేతేపల్లి: అయోధ్య నుంచి తీసుకువచ్చిన రాములోరి అక్షింతలకు మంగళవారం మండలంలోని చీకటిగూడెం గ్రామ రామాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతలను గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ దాచేపల్లి నర్మదనాగేశ్వరావు, మాజీ సర్పంచ్ కోట ప్రభావతి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నోముల నర్సింహయ్యకు ఘన నివాళి

నకిరేకల్ : నాగార్జునసాగర్ దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య 68వ జయంతిని నకిరేకల్‌లో మంగళవారం ఆకుల సోమన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఈ కార్యక్రమానికి హాజరై నర్సింహయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మిత్ర మండలి ప్రతినిధులు సర్వయ్య, సైదులు, సుందర్, తాజేశ్వర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

- చిట్యాల మండలంలోని పలు పాఠశాలల్లో పోస్టులు ఖాళీ
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

చిట్యాల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు మూడు వేల యాభై మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే విద్యార్థులకు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతోపాటు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్న పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది.

ఉపాధ్యాయ ఖాళీలు ఇలా..

చిట్యాల మండలంలో మొత్తంగా 38 ప్రభుత్వ పాఠశాలుండగా వాటిలో 21 ప్రాథమిక పాఠశాలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తంగా 96 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 73 మంది మాత్రమే ఉన్నారు. 23 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు..

చిట్యాల మండలంలోని పాఠశాలల్లో రెండు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాళ్ళవెల్లెంలలోని యూపీఎస్, సుంకెనెపల్లి యూపీఎస్‌లో ఒక్కో స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నాయి.


ఉరుమడ్ల ప్రాథమిక పాఠశాల

ఎస్‌జీటీల ఖాళీలు..

చిట్యాల మండల వ్యాప్తంగా 16 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలోని సుంకెనెపల్లి యూపీఎస్‌లో(01), ఏపూరు పీఎస్‌లో(01), పిట్టంపల్లి యూపీఎస్‌లో(03), వెలిమినేడు పీఎస్‌లో(01), బొంగోనిచెర్వు పీఎస్‌లో(01), వెలిమినేడు బీసీ కాలనీ పీఎస్‌లో(02), మొగిలిదోరి పీఎస్‌లో(01), మొర్సుగూడెం పీఎస్‌లో(01), తాళ్ళవెల్లెంల యూపీఎస్‌లో(01), శివనేనిగూడెం యూపీఎస్(01), చిట్యాల పీఎస్‌లో(01) చొప్పున మొత్తంగా 16 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీలున్నాయి. అంతేకాకుండా శివనేనిగూడెంలోని యూపీఎస్‌లో ఎల్‌పీహెచ్ (లాంగ్వేజ్ పండిట్ హిందీ) ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది. వీటితో పాటుగా ఉరుమడ్ల పీఎస్, గుండ్రాంపల్లి పీఎస్, వెలిమినేడు పీఎస్, వనిపాకల పీఎస్, గుండ్రాంపల్లి పీఎస్, చిట్యాల పీఎస్‌లో ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం(లో ఫీమేల్ లిటరసీ హెచ్ఎం) ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అటెండర్ పోస్టులు కూడా ఖాళీ..

మండల పరిషత్ ఆధీనంలో ఉన్న పాఠశాలల్లో ఆరుగురు అటెండర్లు ఉండాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే ఉన్నారు. నేరడ పీఎస్, ఉరుమడ్ల పీఎస్, తాళ్లవెల్లెంల యూపీఎస్‌లో ఒక్కొక్కరు చొప్పున మూడు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లయితే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుంది. కాగా మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు చిట్యాల మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ నర్సింహ తెలిపారు.

నాణ్యమైన విద్య అందడం లేదు



చిట్యాల మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండడడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. మిగిలిన ఉపాధ్యాయులపై అదనపు భారం పడుతోంది. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను, అటెండర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. అవసరమైన పాఠశాలల్లో అదనపు తరగతి గదులను నిర్మించాలి.

–జోగు గణేశ్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు, చిట్యాల

కనులపండువగా దీపోత్సవం


నల్లగొండ పట్టణంలోని సిద్ధార్థ కాలనీలో గల శ్రీ భూనీల సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


రామగిరిలో దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీనల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్యులు


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

రామగిరి (నల్లగొండ): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రామగిరిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి శ్రీ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్యులు దీపోత్సవాన్ని ప్రారంభించారు. 24వ పాశురం సందర్భంగా అండాళ్ తల్లి మంగళశాసనాలు, పాశురాలను భక్తులు పాడారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులు దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి నిర్వాహకులు ఈశ్వర్‌రెడ్డి సుజాత, భువనగిరి భారతమ్మ, రాజేష్, జనార్దనాచార్యులు, చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణి పాల్గొన్నారు.

సిద్ధార్థ కాలనీలో..

నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డు సిద్ధార్థ కాలనీలో గల శ్రీ భూనీల సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పొత్తి పాశురం, దీపోత్సవం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, తిరువారాధన, ద్రవిడ పారాయణం, పాశురానుసంధానం, సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం జరిగిన అర్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కౌన్సిలర్ మాతంగి సత్యనారాయణ, కంచర్ల సుధాకర్‌రెడ్డి, పొట్లపల్లి శ్యాంసుందర్, వి. మల్లారావు, ఎం. లక్ష్మీనారాయణ, లింగారెడ్డి, మేరెడ్డి నర్సింహారెడ్డి, జ్యోతి, శోభా, శారద పాల్గొన్నారు.


నకిరేకల్: దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చందుపట్లలో..

నకిరేకల్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి భాసుదేవ్ పాండే ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు తెల్లవారుజామున నాలుగు గంటలకు మంగళహారతులో వచ్చి శ్రీ గోదా రంగనాథ స్వాములకు దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు.

నిర్ణీత సమయంలో ఆన్‌లైన్ చేయాలి

మునుగోడు: ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో ఆన్‌లైన్ చేయాలని చండూరు ఆర్డీఓ దామోదర్ రావు సిబ్బందికి సూచించారు. మునుగోడు ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును మంగళవారం ఆయన పరిశీలించారు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ భాస్కర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కట్టంగూర్ : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, కంప్యూటర్ ఆపరేటర్‌లకు ఆన్‌లైన్ నమోదుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దరఖాస్తులో ఉన్న వివరాలను సమగ్రంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునిత, ఎంపీఓ అథర్‌ఫర్వేజ్, సూపరింటెండెంట్ చలపతి, ఏపీఓ రాంమోహన్ పాల్గొన్నారు.


మునుగోడు : ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణ నిలిపివేయాలి

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయాలని కోరుతూ మంగళవారం ఆ గ్రామానికి చెందిన యువకులు పోలగోని శివప్రసాద్, దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అంతటి సురేష్, సురుగురు శివకుమార్ చిట్యాల తహసీల్దార్ జి.దశరథకు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా సీపీఐ మండల కార్యదర్శి అక్బర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.షరీఫ్, మేకల భిక్షం, బొల్లగోరి లింగయ్య, గుండాల సత్తయ్య, దేవేందర్, బైకాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటేశం

చండూరు : అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ పల్లె కళ్యాణి అన్నారు. చండూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పల్లె కళ్యాణి అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం మాట్లాడుతూ బెల్టు షాపులకు మద్యం సరఫరా అవుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని, బెల్టు షాపులు గ్రామాల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వారి సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. తేరట్‌పల్లి, కమ్మగూడెం, శేరిగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. గట్టుప్పల్ పశు వైద్యాధికారి బాలకృష్ణ విధులకు సకాలంలో హాజరుకాకపోవడంతో మూగ జీవాలకు వైద్యం అందడం లేదని తేరట్‌పల్లి ఎంపీటీసీ గౌరిగె సత్తయ్య సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్‌శాఖ ఏఈ సమావేశానికి రాకపోవడం ఎంతవరకు సబబని బంగారిగడ్డ సర్పంచు పల్లె వెంకటేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దారు రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లు తప్పిందిలే..

జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఒక ఉద్యోగి తన ఎలక్ట్రానిక్ బైక్‌కు ప్రతిరోజు కార్యాలయం కింద ఉన్న విద్యుత్ బోర్డులో చార్జింగ్ పెట్టుకుంటున్నాడు. ఉద్యోగి అక్రమంగా బైక్‌కు చార్జింగ్ పెట్టుకుంటుండడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



ప్రశంసాపత్రాలు అందజేత


తానా ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

శాలిగౌరారం: మండలంలోని మనిమద్దె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 'తానా'(తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) ప్రశంసా పత్రాలను సాధించారు. డాక్టర్ చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించిన 'అమ్మ నాన్న గురువు' శతకాలపై డిసెంబర్ 18న ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు ఒకే సమయంలో పద్యార్చన చేశారు. అందులో భాగంగా మనిమద్దె జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ మారోజు వెంకటాచారి ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థుల బృందం పద్యార్చన చేశారు. అందుకుగాను విద్యార్థులకు ప్రశంసా పత్రాలను పంపించారు. ఈ ప్రశంసా పత్రాలను మంగళవారం ఎస్ఎంసీ చైర్మన్ బాష బోయిన వెంకటమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, పాఠశాల సమన్వయ కర్త మారోజు వెంకటాచారి చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సైదులు, వెంకట్‌రెడ్డి, సైదయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీని అమలు చేయాలి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు చేస్తానన్న రెండు లక్షల రూపాయల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణిలోని లోపాలను సవరించి, రైతుల భూమి రికార్డుల్లో తప్పులు లేకుండా సరి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధరతోపాటు ఐదు వందల రూపాయల బోనస్ హామీని నెరవేర్చాలని కోరారు. లడే రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, అవిశెట్టి నర్సింహ శీలా రాజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బండ శ్రీశైలం

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నియోజకవర్గంలోని చర్లగూడెం, కిష్టరాయినిపల్లి రిజర్వాయర్లల్లో భూములు కోల్పోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఇరిగేషన్ అధికారులు, భూ నిర్వాసితులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఎంత ఇచ్చారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో భూమి కోల్పోయిన తమకు ఎకరానికి రూ.5లక్షల 10వేలు మాత్రమే ఇచ్చారని, మల్లన్న సాగర్‌లో రూ.9 లక్షలు ఇచ్చారని, అదే పద్ధతిన తమకు పరిహారం అందించాలని రైతులు కోరారు. త్వరలో పరిహారం పెంపునకు ప్రభుత్వంతో సంప్రదిస్తానని, ఎవరైనా భూమి కోల్పోయి పరిహారం రాకుంటే వారికి అందేలా చొరవ చూపుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భూమి లేకుండా అక్రమంగా పరిహారం పొందిన వారి నుంచి రికవరీ చేయించి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తానన్నారు. అదేవిధంగా బునాదిగాని కాల్వ, పిల్లాయిపల్లి కాల్వల పనులు ఫిబ్రవరి మాసంలో మొదలు పెట్టించి వర్షాలు కురిసే సమయానికి పనులు పూర్తిచేసేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


చండూరు : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

కల్యాణ లక్ష్మి చెక్కులు ఎప్పటికప్పుడే పంపిణీ చేయాలి

ప్రభుత్వం పేద కుటుంబాలకు చెందిన ఆడ పిల్లల పెళ్లిళ్లకు అందిస్తున్న కల్యాణ లక్ష్మి చెక్కులను మంజూరు కాగానే ఎప్పటికప్పుడు పంపిణీ చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని పలువురికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరాయంగా జరిగే పథకాల పంపిణీకి తనను ఆహ్వానించాల్సిన పనిలేదన్నారు. అధికారులే లబ్ధిదారుల గ్రామాలకు వెళ్లి ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీల చేతుల మీదుగా అందజేయాలని సూచించారు. పార్టీలకు అతీతంగా మానవత్వంతో ప్రతి ఒక్కరికి తన శక్తిమేరకు సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నరేష్, ఆర్ఐ నాగరాజు, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ.

పీఆర్‌టీయూ 2024 సంవత్సర నూతన క్యాలెండర్‌ను మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కె. నర్సింహ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యూసుఫ్‌పాష, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, డి.కళావతి, పుష్పమాల, ఎస్.యాదయ్య, రవీందర్‌రెడ్డి, సునీత, వివేక్, లవకుమార్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చండూరు : మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మేడిపల్లి లక్ష్మణ్ కుమారుడు గౌతమ్ మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు కోడి శ్రీనివాసులు, దోటి వెంకటేశ్ యాదవ్ ఇటీవల ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి ఎమ్మెల్యే రూ. 2,50,000 సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంగళవారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో బాధిత బాలుడికి ఆ చెక్కును ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్‌కు ఖర్చు ఎక్కువైనా భరిస్తానని, డాక్టర్లతో మాట్లాడతానని భరోసా ఇచ్చారు. భూతరాజు వేణు, ఐతరాజు మల్లేష్, కల్లెట్ల మారయ్య, ముజ్జు, నల్లగంటి మల్లేశ్, వెంకన్న, గంజి వెంకటేశ్వర్లు, రావిరాల రాజు, చెరిపెల్లి సాయి, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

చండూరు : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని గట్టుప్పల్ గ్రామ సర్పంచు ఇడెం రోజా అన్నారు. మంగళవారం గట్టుప్పల్ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 1, 2022 నుంచి 31 మార్చి 2023 వరకు రూ.కోటి 87 లక్షల 56 వేల పై విలువ గల పనులను కూలీలు చేశారు. వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా మంగళవారం గట్టుప్పల్, చామల పెల్లి, తుమ్మలపల్లి, పుల్లెంల, జోగిగూడెం, బంగారుగడ్డ గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ నెల 13న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ యాకూబ్ నాయక్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ పల్లె వెంకటేశం, కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.


గట్టుప్పల్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సర్పంచు ఇడెం రోజా

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం అన్యాయం

నల్లగొండ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం, సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట వారు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తుంటే అణచివేత ధోరణికి పాల్పడడం సరికాదన్నారు. వెంటనే ఏపీ ప్రభుత్వం వారితో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సునంద, సముద్రమ్మ, సరిత, రేణు, అనిత, శ్రీలక్ష్మి, వెంకటమ్మ, నీలమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


చిట్యాల : వనిపాకల జెడ్పీహెచ్ఎస్‌లో స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి, వనిపాకల, చిట్యాల, గుండ్రాంపల్లి గ్రామాల జెడ్పీహెచ్ఎస్‌లలో చదివే పదో తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ సభ్యుడు పంతంగి కరుణాకర్‌గౌడ్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ చరణ్ స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాదం భిక్షపతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సైదులుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు ఎలకపల్లి మహేష్, సమ్మిడి నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునుగోడు: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను మంగళవారం ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మునుగోడు : స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మంత్రి కోమటిరెడ్డికి పరామర్శ


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, నేతి విద్యాసాగర్

నకిరేకల్ : హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్‌లు పరామర్శించారు. వారివెంట కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, బచ్చుపల్లి గంగాధర్‌రావు తదితరులు ఉన్నారు.